జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## కరీంనగర్

## జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

గురువారం | 12 | డిసెంబర్ | 2024 | పేజీలు : 5


## సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ నియామకం

*సుల్తానాబాద్, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి)*



సుల్తానాబాద్ కోర్టు సెకండ్ క్లాస్ స్పెషల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ గా సీనియర్ న్యాయవాది నేరెళ్ళ శంకరయ్యను నియమిస్తూ పెద్దపల్లి జిల్లా జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం సుల్తానాబాద్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ సమక్షంలో శంకరయ్య పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జడ్జి గణేష్ తో కలిసి పలువురు న్యాయవాదులు శంకరయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు, కార్యదర్శి జోగుల రమేష్, ఏజీపీ దూడం ఆంజనేయులు తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.




**ప్రతి 500 ఇండ్ల దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలనకు ఒక సర్వేయర్ నియామకం**

**పకడ్బందీగా గ్రూప్ 2 పరీక్షల నిర్వహించాలి**

**డిసెంబర్ 14 న డైట్-చార్జీల పెంపు ప్రారంభోత్సవము**

**రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**ఇందిరమ్మ ఇండ్లు, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ, సంక్షేమ హాస్టల్స్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించిన మంత్రి పొంగులేటి**

## ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల
# వివరాలు పకడ్బందీగా సేకరించాలి

*జగిత్యాల బ్యూరో, డిసెంబర్ 11 ప్రజా జ్యోతి:*

రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 80 లక్షల మంది వివరాలను డిసెంబర్ నెలాఖరులోగా పకడ్బందీగా సేకరించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హైదరాబాద్ లోని సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం, ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ, నూతన డైట్ మెనూ పెంపు ప్రారంభోత్సవం కార్యక్రమం, సంక్షేమ హాస్టల్స్ తనికి, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచిన నేపథ్యంలో మనం చేసిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ డిసెంబర్ 9 వరకు ఘనంగా నిర్వహించిన వేడుకలకు మరియు సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ మరియు కుల సర్వే ఇంటింటి కుటుంబ సర్వే విజయవంతంగా పూర్తి



చేసిన నందులకు జిల్లా కలెక్టర్లను, అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. డిసెంబర్ 5న

మిగతా 2 లో...

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

**కరీంనగర్ ఉపాధ్యాయ ఎంఎల్ సి రఘోత్తం రెడ్డి**



*గోదావరిఖని, డిసెంబర్ 11, (ప్రజాజ్యోతి)*

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంను పెంపొందించుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూరల గోత్రం రెడ్డి అన్నారు. బుధవారం ఎన్టిపిసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెద్దపల్లి జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక అండ్ ఇన్ స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనలకు ఆయన ముఖ్యమంత్రి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ తమ పిల్లలను సన్మార్గంలో పెట్టాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై కూడా ఉందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే శాస్త్రీయ అలోచనలను అలవర్చుకొని, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించుకొవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులు తమ వ్యక్తిగత అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి సన్మార్గంలో నడిచేలా, సత్ప్రవర్తనతో మసలుకునేలా చూడాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డి.మాధవి మాట్లాడుతూ పిల్లలు ఇలాంటి

మిగతా 2 లో...

## క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బిరుదు రాజమల్లు స్మారకార్థం త్వరలో ఆటల పోటీలు..**

**ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు**

*సుల్తానాబాద్, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి)*



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ గ్రౌండ్ లో బుధవారం రోజున మండల స్థాయి సీఎం కప్ టోర్నమెంట్స్ ను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ... గ్రామస్థాయి నుండి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం సీఎం కప్ టోర్నమెంట్స్ ను నిర్వహిస్తుందన్నారు. స్వయంగా ఫుట్ బాల్ క్రీడాకారుడు అయిన సీఎం రేవంత్ రెడ్డి క్రీడల ప్రోత్సహించేందుకు ప్రత్యేకించి ఒక యూనివర్సిటీని నెలకొల్పనున్నారని చెప్పారు. గత ప్రభుత్వం క్రీడలను పూర్తిగా విస్మరించిందని చెప్పారు. క్రీడలకు పుట్టినిల్లు అయిన సుల్తానాబాద్ లో

మిగతా 2 లో...

## రాష్ట్రపతి నుంచి ఎన్.పి.ఏ అవార్డు స్వీకరించిన
# పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

*పెద్దపల్లి / సుల్తానాబాద్, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి)*

మంథని మండలం చిల్లపల్లి గ్రామానికి వచ్చిన జాతీయ పంచాయతీ అవార్డు ను జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా స్వీకరించారు. బుధవారం ఢిల్లీలో నిర్వహించిన జాతీయ పంచాయతీ అవార్డుల ప్రధాన తో కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ తో కలిసి పాల్గొన్నారు. 2022-23 వ సంవత్సరంలో మహిళా ఫ్రెండ్లీ పంచాయతీలలో దేశంలోనే మంథని మండలం చిల్లపల్లి గ్రామపంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎంపిక



కావడం జరిగింది. గ్రామంలోని ఆరు సంవత్సరాల పిల్లలందరినీ ఐసిడిఎస్ లో రిజిస్టర్ చేయడం, గ్రామ సభలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం, స్వ శక్తి మహిళా సంఘాలకు రుణాలు అందడం, మాతా శిశు మరణాలు సున్నాకు తగ్గడం,

మిగతా 2 లో...

## విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలి

(మొదటి పేజీ తరువాయి...)

వైజ్ఞానిక ప్రదర్శనలలో పాల్గొనడం వల్ల నాయకత్వ లక్షణాలు అలవడడంతో పాటు స్నేహితులతో కలిసిమెలిసి ఉండడం నేర్చుకుంటారన్నారు. డి.ఎల్.బి.వి.పిలోని ఏడు ఉప అంశాల్లో 241, డి.ఎల్.ఇ.పి.సిలో 71 ఎగ్జిబిట్స్ పాల్గొంటున్నట్లు డి.ఇ.ఓ తెలిపారు.జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావు వివిధ రాష్ట్ర,జాతీయ, అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలలో మన జిల్లా విద్యార్థులు గతంలో రాణించి సాధించిన అవార్డుల వివరాలను తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలిపాక సుజాత, రామగుండం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్.మోహన్, మండల విద్యాధికారులు టి.విమల,కె.ఏకాంబరం,స్వర్ణలత పలువురు ప్రదానోపాధ్యాయులు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గైడ్ టీచర్స్, బాల శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఉపాధ్యాయులు ఇందులో పాల్గొన్నారు.అంతకు ముందు ఎన్.టి.పి.సి పాఠశాల విద్యార్థినిలు చేసిన స్వాగత నృత్యం ఆకట్టుకుంది.మ్యాజిక్ రాజా యాంకరింగ్ అలరించింది.

## క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత..



(మొదటి పేజీ తరువాయి...)

ఎందరో క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఈ ప్రాంతానికి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని చెప్పారు. ఇదే పరంపరను కొనసాగించాలని ఆయన స్థానిక సీనియర్ క్రీడాకారులను కోరారు. ఇందులో భాగంగా జూనియర్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బిరుదు రాజమల్లు స్మారకార్థం తెలంగాణ స్థాయి టోర్నమెంట్స్ ను నిర్వహించనున్నట్టు ఆయన క్రీడాకారుల హర్షద్వానాల మధ్య ప్రకటించారు. తాను స్వయంగా బాధ్యతతో ఈ టోర్నమెంట్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు,ఏఎంసి చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, డివైఎస్ఓ సురేష్,స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ఎం రవీందర్, ఎంపీడీవో, కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రపతి నుంచి ఎన్.పి.ఏ అవార్డు స్వీకరించిన పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష

(మొదటి పేజీ తరువాయి...)

బాలికల విద్య ప్రోత్సాహం వంటి కార్యక్రమాలు అమలు చేసినందుకు చిల్లపల్లి గ్రామం ఉత్తమ గ్రామంగా ఎంపిక కావడం జరిగింది. ఉత్తమ మహిళా ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపికైన చల్లపల్లి గ్రామానికి 75 లక్షల రూపాయల నగదు బహుమతి వచ్చిందని, ఈ నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో ఇదే రీతిలో మహిళల అభ్యున్నతి కొరకు గ్రామంలో పనులు జరగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి.పి.ఓ.వీరబుచ్చయ్య, జడ్పీసీఈవో నరేందర్, డి.ఆర్.డి.ఓ.రవీందర్, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ కుమార్, ఎంపిడిఓ పూర్ణ చందర్ రావు, మండల పంచాయతీ అధికారి శేషా సూరి, డి.పి.ఎం రజాక్, పంచాయతీ కార్యదర్శి రాం కిషోర్, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## అంతిమ యాత్రకు ఆర్థిక సహాయం

**రామగిరి, డిసెంబర్ 11 (ప్రజాజ్యోతి) :** నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తి ఆఖరి మజిలీ యాత్రకు రేండ్ల శారద కుమార స్వామి ఆర్థిక సహాయం అందజేశారు. మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన చంద్రశేఖర నరేందర్ బుధవారం అనారోగ్యంతో అకాల మరణం చెందగా విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన రేండ్ల శారద కుమారస్వామి వెంటనే స్పందించి మృతుని కుటుంబాన్ని పరామర్శించి అంతిమ అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అంతే Pending కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ అతని పిల్లల చదువులకు ఆర్.ఎస్.ఏకే ఆపన్నహస్తం ద్వారా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తానని భరోసా కల్పించారు.



# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల వివరాలు పకడ్బందీగా సేకరించాలి





(మొదటి పేజీ తరువాయి...)

ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల యాప్ ప్రారంభించుకున్నామని అన్నారు. ప్రజాపాలన ద్వారా మనకు సుమారు 80 లక్షల వరకు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తులు వచ్చాయని, ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా 80 లక్షల దరఖాస్తులకు సంబంధించి సంపూర్ణ వివరాలు డిసెంబర్ నెలాఖరులోపు సేకరించాలని, ప్రతి 500 ఇండ్ల దరఖాస్తుల సర్వే కోసం ఒక సర్వేయర్ ను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. పంచాయతీల లో, మున్సిపాలిటీల లో, కార్పొరేషన్లలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను నియమించామని, వీరిని సమన్వయం చేసుకుంటూ వివరాల సేకరణ జరగాలని, షెడ్యూల్ ముందస్తుగానే ఇందిరమ్మ కమిటీల ద్వారా ప్రజలకు తెలియజేయాలని మంత్రి సూచించారు. ప్రస్తుతం మనం ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా సేకరించే డేటా రాబోయే 4 సంవత్సరాలు ఉపయోగ పడుతుందని, ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పక్కాగా వివరాల సేకరణ ఉండాలని అన్నారు. ఈ సర్వేలో ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫోటో నమోదు చేయాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పిల్లలకు అందించే డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమంతో పాటు ఈ విద్యా సంస్థలను రెగ్యులర్ గా తనిఖీ చేయాలని, ఈ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన ఆహారం అందిశగా కృషి చేయాలని అన్నారు. హస్టల్స్ కు సన్నరకం బియ్యం సరఫరా చేస్తున్నామని, ఇందులో అధికంగా నూక వస్తుందని ఫిర్యాదులు ఉన్నాయని వీటిని పరిశీలించి కలెక్టర్లు నాణ్యమైన బియ్యం, విద్యాసంస్థలకు చేరేలా చూడాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ, ప్రజా పాలన ద్వారా సేకరించిన దరఖాస్తు లలో ఇందిరమ్మ ఇండ్ల కింద ప్రభుత్వానికి 80 లక్షల దరఖాస్తులు వచ్చాయని, వీటిని సర్వేయర్ ద్వారా ఇంటింటికి తిరుగుతూ క్షేత్ర స్థాయి లో విచారణ చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ప్రతి 500 ఇండ్ల దరఖాస్తులు సర్వే కొసం ఒక సర్వేయర్ చొప్పున సర్వే చేసేందుకు అవసరమైన □ సిబ్బంది గుర్తించి వారికి శిక్షణ కార్యక్రమం 2 రొజులలో పూర్తి చేయాలని అన్నారు. సర్వే కోసం నగరంలోని వార్డు అధికారులు, బిల్ కలెక్టర్, జూనియర్ అసిస్టెంట్, రూరల్ ప్రాంతాల్లో గ్రామస్థాయి సిబ్బంది సర్వేయర్ లుగా నియమించాలని అన్నారు. ప్రజా పాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొసం దరఖాస్తు చేసుకున్న ప్రజలకు యాప్ ద్వారా సిబ్బంది వివరాల సేకరణకు వస్తున్నారని ముందస్తు సమాచారం అందించాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై ప్రజలకు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం నూతన దరఖాస్తులు తీసుకోవడానికి వీలు లేదని, పాత దరఖాస్తుల పరిశీలన కొసం మాత్రమే సర్వే చేస్తున్నామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రతి సర్వేయర్ రొజుకు 20 ఇండ్ల దరఖాస్తుల సర్వే పూర్తి చేయాలని అన్నారు. గ్రూప్ 2 పరీక్షలను ఎటువంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్ అధికారులకు సూచించారు. డిసెంబర్ 14న జిల్లాలలో ఉన్న రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, మాడల్ స్కూల్స్, ఆశ్రమ పాఠశాలలు, కేజిబీవి లో 40% డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. డైట్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులను ఆహ్వానించాలని, ముఖ్యంగా తల్లి హాజరయ్యే విధంగా చూసుకోవాలని అన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డైట్ చార్జీల పెంపు లాంచ్ కార్యక్రమం జరగాలని, ఆ రోజు విద్యార్థులకు స్పెషల్ ఆహారం అందించాలని, ప్రతి విద్యా సంస్థలు మెన్యు కు సంబంధించి వివరాల ఫ్లెక్సీ ప్రచురణ చేయాలని అన్నారు. పాఠశాలల్లో వంట గది నిర్వహణ, పిల్లలకు అందించాల్సిన నాణ్యమైన ఆహారం తదితర అంశాలపై స్టాఫ్ కు అవగాహన కల్పించాలని అన్నారు. డైట్ చార్జీల పెంపు కార్యక్రమంలో మంత్రులు, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు పోలీసు ఉన్నతాధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు ఉన్నతాధికారులు పాల్గొనేలా చూడాలని సీఎస్ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం మాట్లాడుతూ, గ్రూప్ 1 & గ్రూప్ 3 పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని, ఈ సంవత్సరం చివరగా గ్రూప్ 2 పరీక్షలను డిసెంబర్ 15,16వ తేదీలలో 2 సెషన్స్ లలో జరుగుతాయని అన్నారు. గ్రూప్ 2 పరీక్షలలో అభ్యర్థులకు ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్ అందించడం జరుగుతుందని అన్నారు. గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ సంబంధించి చేసిన ఏర్పాట్లను, పాటించాల్సిన నియమాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రతి పరీక్ష చాలా కీలకమని, ఎక్కడ ఎటువంటి చిన్న పొరపాటు జరగకుండా పకడ్బందీగా పరీక్షను నిర్వహించాలని చైర్మన్ కలెక్టర్లను కోరారు. ప్రతి అభ్యర్థికి ఓఎంఆర్ షీట్ ప్రత్యేకంగా ఉన్నందున పరీక్ష హాలలో అభ్యర్థి రాకపోయినా అతని స్థానంలో ఓఎంఆర్ షీట్ ప్రశ్నాపత్రం అలాగే పెట్టాలని, ఒకరి ఓఎంఆర్ షీట్ మరొకరికి ఇవ్వడానికి వీలు లేదని, పరీక్షా కేంద్రాలకు అభ్యర్థుల సకాలంలో చేరుకునేలా ముందుగానే విస్తృత ప్రచారం జిల్లాలలో కల్పించాలని, పరీక్ష సమయాలు , గేటు ఏ సమయంలో మూసి వేస్తాం వాటి అంశాలు విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. జగిత్యాల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ సత్య ప్రసాద్, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్,అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ బిఎస్ లతా,అడిషనల్ ఎస్పీ భీమ్రావు అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ గౌతమ్ రెడ్డి జగిత్యాల ఆర్డిఓ మధుసూదన్ ఎస్సీ వెల్ఫేర్ రాజకుమార్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

*గోదావరిఖని, డిసెంబర్ 11 (ప్రజాజ్యోతి)*



ప్రతి ఉద్యోగి రక్షణ నియమాలు పాటిస్తూ బొగ్గు ఉత్పత్తిని సాధించాలని పోగ్రాం కన్వీనర్,కార్పోరేట్ జియం నారాయణ రావు(ఆర్.అండ్.డి), ఆర్జీ1 జియం లలిత్ కుమార్,రామగుండం రీజియన్ సేఫ్టీ జియం గుప్త అన్నారు.బుధవారం జిడికే5 ఓసి లో ఘనంగా 55 వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వారు హాజరై రక్షణ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఉద్యోగులచే రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. రక్షణ పక్షోత్సవాల తనిఖీ బృందం ఫిట్ స్టోర్,ఉపరితల గని క్వారీ,హాలేజి దారి,డంపర్,శావల్స్ తదితర వాటిని సందర్శించారు.ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరు రక్షణ చర్యలు పాటిస్తూ ముందుకు సాగాలని,నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా రక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు బహుమతులు ప్రధానం చేశారు.రక్షణ కమిటీ సభ్యులు ఉపరితల గని క్వారీకి వెళ్ళి అక్కడ రక్షణకు సంబందించి చేపట్టిన జాగ్రత్త చర్యలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఓసి.5 పివో.చంద్రశేఖర్,సేఫ్టీ ఆఫీసర్ పోనగోటి శ్రీనివాస్,మేనేజర్ రమేష్ బాబు,ఎఐటియుసి నాయకులు అరెల్లి పోషం,స్వామీ,ప్రభుదాస్,అధికారులు రమేష్,సునీల్ వర్మ,కార్పోరేట్ అధికారులు రామకృష్ణ,లక్ష్మి రాజు సంక్షేమాదికారి ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.

# పదోన్నతి విభాగలపై మహిళా ఉద్యోగులకు కౌన్సిలింగ్

**రామగిరి, డిసెంబర్ 11 (ప్రజాజ్యోతి):**

ఆర్జీ-3, ఏపీఏ ఏరియాలలో మజ్దూర్లుగా విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగుల కోసం గుర్తించ బడిన హోదాలలో పనిచేస్తూ, పదోన్నతులు పొందేందుకు ఉన్నటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని రామగుండం-3 ఏరియా ఎస్వోటు జియం గుంజపడుగు రఘుపతి అన్నారు. రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జీఏం కార్యాలయంలో వివిధ విభాగాల్లో బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్లుగా విధులు



నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులకు సంబంధిత కమిటీ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్ఫేస్ లో పని చేసేందుకు వీలుగా ఉన్నటువంటి 16 రకాల పోస్టుల గురించి క్షుణ్ణంగా తెలియజేసి, ఆ హోదాలలో ఉండే పని విధానాన్ని కూడా వివరించారు. ఈ కౌన్సిలింగ్ కు మొత్తం 16 మంది మహిళా బదిలీ వర్కర్లు, జనరల్ మజ్దూర్ ఉద్యోగులు హాజరయ్యారు. దీని ఆధారంగా మహిళా ఉద్యోగులు ఎంచుకున్న పోస్టులకు సంబంధించిన శిక్షణను అందించి, విధులకు పంపించడం జరుగుతుందని అన్నారు. కావున మహిళా ఉద్యోగులందరూ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రయోజనంతో పాటు, భవిష్యత్తులో పదోన్నతులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఈ డిజియం కె.చంద్రశేఖర్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృపానంద్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన ట్రస్టుకు విరాళం అందజేత

**చొప్పదండి, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

చొప్పదండి శ్రీ వెంకటేశ్వర మణికంఠ ఆలయ అన్నదాన ట్రస్ట్ ఏర్పాటుకు బుధవారం విరాళాలు అందాయి. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి సాంబయ్య రూ.1,18,116 విరాళం ఇవ్వగా, చెట్టిపల్లి కళావతి దామోదర్ రూ.18,115 అందించారు. దాతలు ముందుకు వచ్చి ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు బొడిగె వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, కోశాధికారి దండే సత్యానందం, ఉపాధ్యక్షుడు ఎలిగేటి రాములు, ఐట్ల మల్లేశం, మామిడాల నిరంజన్, చెట్టిపల్లి వెంకటేష్, దండే లింగన్న, దూస రాము, మల్లేశం, రమేష్, ప్రకాష్



తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పై దాడి అమానుషం

**-దోనికేనా పూర్ణ చందర్ గౌడ్**

**హుజురాబాద్, డిసెంబర్ 11, ప్రజా జ్యోతి:**

జర్నలిస్ట్ రంజిత్ పైన 70 సంవత్సరాలు ఉన్న మోహన్ బాబు దాడి చేయటం హెయమైన చర్య అని అమ్ ఆద్మీ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జి దొనికెన పూర్ణచందర్ గౌడ్ అన్నారు. సినీ ఇండస్ట్రీ లో పెద్దమనిషి ల చలామణి అవుతున్న మోహన్ బాబు



విచక్షణకోల్పోయి జర్నలిస్ట్ ల పైన దాడి చేయటం ఈ సమాజం తల దించుకునే చర్య అని అన్నారు. ఆంధ్ర లో ఏ పార్టీ అధికారం లో ఉంటే వారిని ప్రసన్నం చేసు కొని వందల కోట్లు పోగుచేసుకున్న ఆయనకు నేను ఏది చేసిన చెల్లుతుంది అని ధీమాతో ఉన్నారని పేర్కొన్నారు. డబ్బు అహంకారం తో ఒక అయ్యప్ప దీక్ష లో ఉన్న రంజిత్ అనే జర్నలిస్ట్ పైన దాడి చేయటం సిగ్గుమాలిన చర్య అన్నారు. తక్షణమే నిధితుణ్ణి ఎలాంటి ప్రలోబాలకు లొంగకుండా అరెస్ట్ చేయాలనీ డిమాండ్ చేశారు. దీనిపైన సినీ పరిశ్రమ, మా అసోసియేషన్ స్పందించకుంటే ఆమ్ ఆద్మీ పార్టీ తరపున తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

# వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఘనంగా గీతా జయంతి వేడుకలు

**సుల్తానాబాద్, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి)**

గీత జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని సుల్తానాబాద్ వికాస తరంగిణి శాఖ ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వేణు గోపాల స్వామి వారి ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భగవద్గీత గ్రంథాలకు పూజలు చేసి గీత పారాయణాన్ని మహిళలంతా కలిసి సామూహికంగా నిర్వహించారు... ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా భగవద్గీతను పారాయణం చేయవచ్చని ఇది మతాలకు కులాలకు అతీతంగా ఉంటూ మానవుల జీవన విధానాన్ని సక్రమ మార్గాన్ని జీవిత ఔన్నత్యాన్ని చాటి చెపుతుందని వికాస తరంగిణి సుల్తానాబాద్ శాఖ అధ్యక్షులు సాదుల సుగుణాకర్ మహిళా ప్రతినిధులు పల్లా సదాలక్ష్మి, రాజమణి, కొమురవెల్లి లత, నగునూరి లక్ష్మి, ఐతు మానస తదితరులు అన్నారు.. భగవద్గీతను కొన్ని సందర్భాల్లోనే గుర్తు చేసుకోవడం ఒక తప్పుడు ఆనవాయితీగా కొనసాగుతుందని అలా కాకుండా ఇది నిత్య పారాయణం చేసే ఒక మంచి గ్రంథమని వారు సూచించారు అనంతరం భక్తులకు పండ్ల పంపిణీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో పొదిల్లా రమేష్, ఎస్ఎంసి వనజ,పల్లా లలిత,,లెక్కల పల్లవి,



యాంశాని రమాదేవి, వసుధ, ధనలక్ష్మి, వసంత సంతోషిని విజయ కాసం లిఖిత సౌమ్య ప్రసాద్ రేవతి తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్ట్ పై మోహన్ బాబు దాడి సరికాదు

**గోదావరిఖని ప్రెస్ క్లబ్**

**గోదావరిఖని, డిసెంబర్ 11 (ప్రజాజ్యోతి)**

ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబు జర్నలిస్టుపై దాడి చేయడం సరికాదని గోదావరిఖని ప్రెస్ క్లబ్ ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ జల్ పల్లిలో మంగళవారం రాత్రి సినీ నటుడు మోహన్ బాబు ఇంటి వద్ద జరిగిన సంఘటనను కవరేజ్ చేయడానికి వెళ్ళిన టీవీ9 జర్నలిస్ట్ రంజిత్ పై మోహన్ బాబు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పూదరి కుమార్, పందిళ్ళ శ్యామ్ సుందర్, ఉపాధ్యక్షులు మాదాసి శ్రీనివాస్, గసికంటి రవీందర్, మామిడి కుమారస్వామి, విలాసాగరపు శ్రీనివాస్, కోశాధికారి గడ్డం శ్యామ్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ లు ఎం.వంశీ, జక్కం మారుతి, అల్లెంకి లచ్చయ్య, వేల్పుల నారాయణ, కోల లక్ష్మన్, జక్కం సత్యనారాయణ, ఎ.రవీందర్ రెడ్డి, దయానంద్ గాంధీ, డి.మాధవరావు, కె.చంద్రశేఖర్ రెడ్డి, తగరపు శంకర్, కెఎస్ వాసు, ఇజ్జగిరి సమ్మయ్య, జీవన్ బాబు, పి.భిక్షపతి, పాలకుర్తి విజయ్ కుమార్, గోలి సమ్మిరెడ్డి, భైరం సతీష్, మామిడి సత్యనారాయణ, డి.చంద్రశేఖర్, గంట రవీందర్, మూల శంకర్, మ్యాజిక్ రాజా తెలిపారు. మంచు మనోజ్ తో పాటు జర్నలిస్ట్ లు ఇంటిలోకి వెళ్ళిన సమయంలో మోహన్ బాబు టీవీ లోగోను చేతిలోకి తీసుకుని జర్నలిస్ట్ పై దాడికి పూనుకున్నాడని, వార్త సేకరణలో ఉన్న జర్నలిస్ట్ పై మోహన్ బాబు ఇలా వ్యవహరించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. జర్నలిస్ట్ పై దాడికి పాల్పడిన మోహన్ బాబు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# మీడియాపై దాడి...హేయమైన చర్య

**★ బహిరంగ క్షమాపణ చెప్పాలి**

**-ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బూర్ల రమేష్**

**కొడిమ్యాల, డిసెంబర్ 11, (ప్రజాజ్యోతి):**

మీడియా ప్రతినిధులపై దాడి చేయడం హేయమైన చర్యని, దాడి చేసిన సినీనటుడు మోహన్ బాబును కఠినంగా శిక్షించాలని టీయూడబ్ల్యూజే (ఐజెయూ) హెచ్ 143 ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షులు బూర్ల రమేష్ డిమాండ్ చేసాడు. బుధవారం రోజున మండల కేంద్రంలోని విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా ఉన్న మీడియాకు జవాబుదారీగా ఉండాల్సిన వ్యక్తులు అసహనంతో భౌతిక దాడులకు పాల్పడడం సరైనది కాదని పేర్కొన్నారు. సమాజానికి వాస్తవాలు చెప్పడం కోసం పాత్రికేయులు వృత్తి నిబద్ధతతో పనిచేస్తారని అలాంటి మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మోహన్ బాబు మీడియాకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మీడియా ప్రతినిధులపై దాడి చేసిన మోహన్ బాబుపై కేసు నమోదు చేయాలని కోరారు. మీడియా ప్రతినిధులపై భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం పోలీసులు కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు అడ్లగట్ట గంగాధర్, మండల గౌరవ అధ్యక్షులు పైడిపల్లి సతీష్ రావు, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు బర్ల నరేష్, సత్యానందం, కోశాధికారి రమేష్, సభ్యులు గణేష్, శేఖర్, నాగార్జున, రవి, శ్రీనివాస చారి, రఫీ, మహిపాల్, శేఖర్ పాల్గొన్నారు.

# మండల పరిషత్ సమావేశం

**చొప్పదండి, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

మండల పరిషత్ సమావేశం గురువారం ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేణుగోపాలరావు తెలిపారు. చొప్పదండి మండలం లో వార్డుల వారీగా గ్రామపంచాయతీ పోలింగ్ కేంద్రాల జాబితా అంశం పై సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల బాధ్యులు సకాలంలో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

# క్రీడలకు ప్రాధాన్యత నివ్వాలి



**చొప్పదండి, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

చదువుతోపాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో సీఎం కప్ క్రీడల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. గెలుపొందిన జట్లకు పతకాలు అందజేశారు. మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ మాట్లాడుతూ ఉన్నత స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, ఎంఈఓ శ్రీనివాస దీక్షిత్, ఎస్ ఐ జి. అనూష, కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఓల్లాల కృష్ణహరి, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పెరుమాండ్ల గంగయ్య, ముద్దం తిరుపతి, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి ఆలయానికి విరాళాలు



**చొప్పదండి, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి):**

చొప్పదండి జ్ఞాన సరస్వతి దేవాలయంలో 14,15,16 తేదీల్లో జరిగే వార్షికోత్సవాల సందర్భంగా భక్తులు పలువురు విరాళాలు అందించారు. చొప్పదండికి చెందిన డోలి రాజయ్య రూ. 10,000, కరీంనగర్ కు చెందిన పలు విద్యా సంస్థల చైర్మన్ కొత్త సతీష్ రెడ్డి రూ.35,000 విరాళాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జగన్మోహన్ స్వామి, ఆలయ కమిటీ సభ్యుడు గుర్రం ఆనందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గీర్వాణి విద్యాలయంలో గీతా జయంతి వేడుకలు



*చొప్పదండి, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి):*
గీర్వాణి విద్యాలయంలో బుధవారం గీతా జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అందుర్తి లత, పాఠశాల కోఆర్డినేటర్లు కోడూరి నాగ రాజు, సిరిపురం శ్రీనివాస్, యోగ మాస్టర్ సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

**– తల్లిదండ్రుల ఆవేదన**



*హుజురాబాద్, డిసెంబర్ 11, ప్రజా జ్యోతి:*
విద్యా సంవత్సరం మధ్యలో స్కూల్ మూసివేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడవద్దని విశ్వ ప్రగతి స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద వారు ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ... మరో మూడు నెలల్లో విద్యా సంవత్సరం ముగియనుందని, కోర్టు తీర్పు ఇచ్చిందని పాఠశాలను మూసివేసి విద్యార్థుల జీవితాలను నాశనం చేయొద్దని వారు కోరారు. విద్యా సంవత్సరం ముగిసిన తర్వాత పాఠశాలను మూసివేయాలి, కానీ మధ్యలో మూసి వేయడం వల్ల విద్యార్థులను ఏ పాఠశాలలో చేర్చుకోరని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పిల్లల జీవితాలను కాపాడాలని వారు కోరారు.

## నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఆటల పోటీలు

*చొప్పదండి, డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి):*
నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో డిసెంబర్ 13, 14 తేదీల్లో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు వాలంటీర్ అనూష్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగే క్రీడలలో కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ , బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయంలో ఘనంగా అభిషేక మహోత్సవం



*సుల్తానాబాద్ డిసెంబర్ 11 (ప్రజా జ్యోతి)*
సుల్తానాబాద్ మండల కేంద్రంలోని నీరుకుల్ల రోడ్డులో కొలువున్న శ్రీ శ్రీ శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి మూల విరాట్టుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా అభిషేక మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సుంపటం కార్తీక్ ఆచార్యుల సారధ్యంలో అయ్యప్ప స్వామి నామస్మరణ, సంకీర్తనలతో శరణు ఘోష చేస్తూ స్వామివారికి పంచామృత సహిత ఫలాభిషేకం, అలంకారం, పుష్పార్చన, ధూప దీప నైవేద్యం, మహా హారతి, మంత్రపుష్పం గావించిన అనంతరం భక్తులకు ఆశీర్వాదం, తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, అయ్యప్ప మాలాధారులు, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి బోర్డు మెంబర్ నర్సిరెడ్డిని కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకుడు టేకుల శ్రావణ్

*హుజురాబాద్, డిసెంబర్ 11, ప్రజా జ్యోతి:*
తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులు (టీటీడీ బోర్డు మెంబర్ )నన్నూరి నర్సిరెడ్డి ని హుజురాబాద్ యూత్ కాంగ్రెస్ నాయకులు టేకుల శ్రావణ్ హైదరాబాద్ లో కలిశారు. బుధవారం హైదరాబాద్ లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం



శ్రావణ్ మాట్లాడుతూ...పార్టీలకు అతీతంగా అందరితో కలిసి మెలిసి ఉండే మంచి మనసున్న వ్యక్తి నర్సిరెడ్డినీ చాలా రోజుల తర్వాత కలవడం ఆనందంగా ఉందని అన్నారు. తిరుమల శ్రీవారి ఆశీస్సులతో వారు చేపట్టిన పదవికి పూర్తి న్యాయం చేయాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పలపల్లి చంద్రశేఖర్, అల్లెపు విజయ్, ఆకునూరి అజిత్, కమటం సందీప్ తదితరులు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో సెయింట్ జార్జ్ విద్యార్థుల ప్రతిభ

*కరీంనగర్ రూరల్, డిసెంబర్ 11,,ప్రజాజ్యోతి*
రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో కరీంనగర్లోని సెయింట్ జార్జ్ పాఠశాల విద్యార్థులు మొదటి బహుమతి కైవసం చేసుకొని ప్రతిభ చాటినట్లు చైర్మన్ పి.ఫాతిమా రెడ్డి తెలిపారు,ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 7 నుండి 9వ వరకు గోవాలో యూత్ అండ్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓపెన్ నేషనల్ ఛాంపియన్షిప్ లో మొదటి బహుమతి కైవసం చేసుకున్నారని తెలిపారు,విద్యార్థులు చక్కగా ఆడి ఫైనల్ ఛాంపియన్షిప్ గెలవడం పైన హర్షం వ్యక్తం చేస్తూ వాళ్ళకి ట్రైనింగ్ ఇచ్చిన సాయినాథ్ ను చైర్మన్ అభినందించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు,




## గుండెపోటుతో దళిత నాయకుడు ఆరెపల్లి బాబు మృతి

**ఘన నివాళులర్పించిన ప్రజాసంఘాల నాయకులు**





*సైదాపూర్ డిసెంబర్ 11 (ప్రజాజ్యోతి):*
హనుమకొండ జిల్లా పీపుల్స్ డైరీ దినపత్రిక స్పెషల్ కరస్పాండెంట్ కండెరమేష్... బామ్మర్ది అమ్మనుగుర్తి గ్రామానికి చెందిన ఆరేపల్లి బాబు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు.ఆదివారం అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు.మంగళవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు.దీంతో అమ్మనగుర్తి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ సందర్భంగా బుధవారం అమ్మనగుర్తి లో నిర్వహించిన అంత్యక్రియల్లో అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్,జేఏసీ చైర్మన్ డ్యాగల సారయ్య,హుస్నాబాద్ ఎంఆర్పిఎస్ ఇంచార్జి మాట్ల వెంకటస్వామి,అంబేద్కర్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కండె సుధాకర్ పాల్గొని ఆయన భౌతిక కాయనికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను ఓదార్చి సంతాపం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత సామాజిక వర్గానికి చెంది బాబు గత కొన్ని సంవత్సరాల క్రితం సినిమా థియేటర్లో ఆపరేటర్ గా పని చేస్తూ ఎంతో కష్టపడుతూ తన కుమారులను,కుమార్తెలను ఉన్నత చదువులు చదివించారు.ఒక కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.ప్రతి ఒక్కరితో స్నేహపూర్వకంగా ఉండేవారు.ఆపద సమయంలో తన వంతు సహాయ సహకారాలు అందించేవారు.స్వయం శక్తితో ఎదిగి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారన్నారు.కుమారులు,కుమార్తెలను ప్రయోజకులను చేయడంకోసం అహర్నిశలు కష్టపడ్డారు.ఆయన అంత్యక్రియలకు ప్రజాసంఘాల నాయకులు వివిధ పార్టీల నాయకులు దళిత సంఘాల నాయకులు ప్రజలు భారీ ఎత్తున తరలివచ్చి నివాళులర్పించారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

*జగిత్యాల అర్బన్,డిసెంబర్ 11,ప్రజా జ్యోతి*
జగిత్యాల జిల్లా లోని సారంగాపూర్ మండల కేంద్రంలోని కస్తూరిభా గురుకుల పాఠశాలలో చలి తీవ్రతతో అస్వస్థతకు గురయిన 6 గురు విద్యార్థినులు..తక్షణమే స్పందించిన గురుకుల పాఠశాల సిబ్బంది పిల్లలు చలికి వణుకుతుండగా గుర్తించిన స్కూల్ సిబ్బంది వీరిని చికిత్స నిమిత్తం 108 ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి తరలించారు.,ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడానే ఉందని, సాయంత్రం వరకు డిశ్చార్జ్ చేస్తామని తెలిపిన అధికారులు

## నిరుపేద యువతి వివాహానికి అనంతారం గ్రామస్తుల అండ

*జగిత్యాల అర్బన్, డిసెంబర్ 11, ప్రజా జ్యోతి*
జగిత్యాల రూరల్ మం. అనంతారం గ్రామస్తుల ఔదార్యం..వివాహ ఏర్పాట్లలో ఏమాత్రం లోటు లేకుండా ఘనంగా తమ గ్రామ ఆడపడుచు వివాహం దగ్గరుండి మరి జరిపించిన గ్రామస్తులుఅనంతారం గ్రామంలో గ్రామస్తులే పెళ్లి పెద్దలుగా వ్యవహరించి అంగరంగ వైభవంగా అమ్మాయి పెళ్లి జరిపించారు.గ్రామస్తులంతా కలిసి తమకి తోచినంత సాయాన్ని అందజేశారు. పెళ్లికి అవసరమయ్యే సామగ్రితో పాటు ఇతరత్రా ఖర్చులన్నీ గ్రామస్తులే భరించారు.గ్రామంలో ఫోటో గ్రాఫర్ దగ్గర నుండి షామియానాలు, బ్యాండ్ మేళం, వంట వారు సైతం ఉచితంగానే సామాగ్రి అందజేశారు.గ్రామస్తుల సాయంపై యువతి తల్లిదండ్రులు సహాయం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.పేదింటి అమ్మాయి పెళ్లికి అండగా నిలిచిన గ్రామస్తులపై పలువురు ప్రశంసలు కురిపిస్తున్నారు..

# ఘనంగా గీత జయంతి వేడుకలు

**జగిత్యాల టౌన్ డిసెంబర్ 11,ప్రజాజ్యోతి**

మాసాలన్నింటిలోను మార్గశిర మాసం శ్రీమహావిష్ణువుకు అత్యంత ఇష్టమైనదని స్వయంగా నారాయణుడే చెప్పాడంట. ఇదే మాసంలో వచ్చే ఈ రోజున గీతా జయంతిని కూడా నిర్వహించారు హిందు మతంలో గీతా జయంతిని ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఈ సారి ఈ రోజున గీతాజయంతి వచ్చింది కాబట్టి గీత జయంతి జరుపుకున్నారు ఈ రోజున విష్ణువును చాలా మంది ఆరాధిస్తుంటారు. నారాయణుడి గుడికివెళ్లి ప్రత్యేకంగా పూజలు సైతం నిర్వహిస్తారు.హిందు మతంలో గీతా జయంతిని ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఈ సారి ఈ రోజున గీతాజయంతి వచ్చింది. గీతా జయంతి రోజునే మోక్షద ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి కూడా జరుపుకుంటాం. ఈ రోజున విష్ణువును చాలా మంది ఆరాధిస్తుంటారు. నారాయణుడి గుడికివెళ్లి ప్రత్యేకంగా పూజలు సైతం నిర్వహిస్తారు.సాధారణంగా మనకు ఉన్న ప్రతి తెలుగు నెలల్లో ప్రతి ఒక దానికి ఏదో ఒక ప్రాధాన్యత తప్పకుండా ఉంటుంది. అయితే.. కొన్ని నెలలు మాత్రం అత్యంత పవిత్రమైనదిగా చెప్తుంటారు.వాటిలొ ముఖ్యంగా భాద్రపద మాసం, శ్రావణం, కార్తీక మాసం, మార్గశిర మాసంలను అత్యంత పవిత్రమైన మాసాలుగా చెప్తుంటారు. ముఖ్యంగా మార్గశిర మాసంను మాసాలన్నింటిలోను అత్యంత పుణ్యమైన మాసంగా చెప్తుంటారంట.అందుకే మాసానాం మార్గశిర్షోహం అంటారు. అంటే.. అన్ని నెలలకు కూడా ఈ మాసం శిరస్సు తల వంటిదని అర్థం. ఈ నెలలోనే కురకేత్ర యుద్ధం స్టార్ట్ అయ్యిందంట. మార్గశిర మాసంలో శుక్ల పక్ష ఏకాదశి రోజు శ్రీకృష్ణుడు విశ్వరూపం చూపించి.. అర్జునుడికి గీతా ఉపదేశం చేస్తాడంట. అందుకే.. మార్గశిర మాసం పాడ్యమి నుంచి పౌర్ణమి రోజు వరకు ఎంతో పవిత్రంగా గీతాజయంతి ఉత్సవాలు నిర్వహిస్తారు





**గీతాజయంతి రోజున ఏంచేస్తారు అంటే....**

గీతాజయంతి రోజున సూర్యోదయమే నిద్రనుంచి లేచి ఆ తర్వాత శుచిగా స్నానం చేసి విష్ణు ఆలయాలలో దీపారాధన చేయాలి. అంతే కాకుండా.. నారాయణుడు అలంకార ప్రియుడు కాబట్టి ఆయన మందిరంను, విగ్రహాలను రకరకాల పూలతో అలంకరణ చేయాలి. భగవద్గీత పుస్తక పారాయణ చేయాలి. అదే విధంగా పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెరతో అభిషేకం చేయాలి. ఐదు రకాల పండ్లు, స్వీట్లను నైవేద్యంగా పెట్టాలి. ఆరోజున నోరు లేని జీవాలకు, పేదవాళ్లకు తమకు తోచిన విధంగా దాన, ధర్మాలు చేయాలని పండితులు చెబుతున్నారు.



# 13,15 వార్డులలో బిజెపి నూతన బూత్ కమిటీల నియామకం





**కోరుట్ల డిసెంబర్ 11 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలోని భీమనిదుబ్బ శక్తి కేంద్రం ఇంచార్జ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సుదవేని మహేష్ ఆధ్వర్యంలో 13,15,01,వ వార్డులలోని 143,144,145, 146 బూత్ లలో బుధవారం నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. ఆయా బూత్ లకు సుదవేని కీర్తన, గడ్డం రాజశేఖర్, నారవేణి అశోక్, అందుర్తి రమేష్‌లను అధ్యక్షులుగా నియమించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగిత్యాల జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి రాచకొండ యాదగిరి బాబు హజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం మన భావి తరాల భవిష్యత్తు కోసం బడుగు బలహీన వర్గాల ఉన్నతి కోసం అహర్నిశలు కష్టపడుతున్న మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయ జనతా పార్టీని బలపరచాలని కోరారు. బిజెపి పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్ని వర్గాలు సుఖ శాంతులతో జీవిస్తున్నారని, అందుకే ఢిల్లీలోనే కాదు గల్లీలో కూడా భారతీయ జనతా పార్టీని గెలిపించాలని, బూత్ స్థాయిలో కమిటీ పటిష్టంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ బిజెపి అధ్యక్షులు బింగి వెంకటేష్, బిజెపి సీనియర్ నాయకులు పోతుగంటి శ్రీనివాస్, ఇల్లెందుల కీర్తి కుమార్, పోతుగంటి లవకుమార్, చింతకింది రాజేశం, దువ్వాక శంకర్, నారవేణి విజయ్, గడ్డం శ్రీనివాస్, పోతుగంటి రవి, మద్దుల హరీష్, గంగాధర్, కళ్యాణ్, కంటాల శివ, గట్ల నిఖిల్ సాయి, పోతుగంటి శ్రావణ్ కుమార్, భరత్, నవదీప్, మనివర్షిత్ హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో ఘనంగా గీతా జయంతి వేడుకలు

**కోరుట్ల డిసెంబర్ 11 ప్రజాజ్యోతి**

కోరుట్ల పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో బుధవారం గీతా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలుగు పండితులు, ప్రముఖ విద్యావేత్త, కవి బట్టు హరికృష్ణ, విశ్రాంత కమిషనర్ కుమార స్వామిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన బట్టు హరికృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ గీత జయంతి విశిష్టత, ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. భగవద్గీత పుట్టిన రోజు పురస్కరించుకొని శ్రీకృష్ణుడు అర్జునునికి హితోపదేశం ఏ విధంగా చేశాడు, కర్మానుసారం బందుపరివార బంధాలను కర్మలో భాగంగా ఏ విధంగా ముందుకు వెళ్లాలి, ధర్మానికి అధర్మానికి ఉన్న తేడాను వివరించారు. విద్యార్థులకు భగవద్గీత పైన మక్కువ ఏర్పడేలా కచ్చితంగా శ్లోకాలు నేర్చుకోవడం చేయవలసి ఉంటుందని, శ్లోకాలు నేర్చుకోవడం వలన భవిష్యత్తులో అన్ని భాషల పైన పట్టును సంపాదించి అనర్గళంగా మాట్లాడే శక్తిని పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపు వెంకటేష్, ప్రబంధకారిని కార్యదర్శి వనపర్తి చంద్రమోహన్, పాఠశాల కోశాధికారి కరస్పాండెంట్ నీలి శ్రీనివాస్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## లారీ ఢీ... ధ్వంసమైన చాకలి ఐలమ్మ విగ్రహం..

**మెట్ పల్లి, డిసెంబర్ 11, ప్రజా జ్యోతి:**

మెట్ పల్లి పట్టణం పాత బస్టాండ్ వద్ద రోడ్డు డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కోరుట్ల వైపు నుండి ఏపీ 07 టీబీ 3897 నెంబర్ గల లారీ చెరుకు లోడుతో అతివేగంగా నడుపుకుంటూ కామారెడ్డి వైపు వెళ్తున్న సమయంలో పాత బస్టాండ్ వద్ద విగ్రహాన్ని ఢీకొట్టడంతో చాకలి ఐలమ్మ విగ్ర హం ధ్వంసం అయింది. సమాచారం తెలుసుకున్న సీఐ నిరంజన్ రెడ్డి తన సిబ్బందితో హుటాహుటిన తరలి వచ్చి ద్వంసమైన విగ్రహాన్ని వాహనంలో ము న్సిపల్ ఆఫీస్ కు తరలించి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా క్రమబద్ధీకరించారు. అనంతరం పోలీసులు విగ్రహాన్ని ఢీ కొట్టిన లారీని పట్టుకొని, పోలీస్ స్టేషన్ కు తరలించి లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.



## ప్రొసీడింగ్ పత్రాలను పొందిన లబ్ధిదారులకు ప్రథమ స్థానం

**మెట్ పల్లి, డిసెంబర్ 11, ప్రజా జ్యోతి:**

గత ప్రభుత్వం బిఆర్ఎస్ హయాంలో నిరుపేదల కుటుంబాలకు ఇండ్లు నిర్మించుకోవడానికి మూడు లక్షల ప్రొసీడింగ్ పత్రాలను అర్హులైన వారికి అందించడం జరిగిందని బిఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు ఓజ్జల శ్రీనివాస్ పటేల్ అన్నారు. అర్హులైన వారికి తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో గత ప్రభుత్వంలో ఇండ్ల నిర్మాణానికి ప్రొసీడింగ్ పత్రాలను పొందిన లబ్ధిదారులకు ప్రథమ స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగినదని తెలిపారు.



## జగిత్యాల లలో గుట్టుగా నడుస్తున్న వ్యభిచారం

**జగిత్యాల టౌన్ డిసెంబర్ 11 ప్రజా జ్యోతి:**

జగిత్యాల్ పట్టణంలో ని కొన్ని లాడ్జ్ లో గతకొన్ని రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా నడుస్తున్న వ్యభిచారం... గంటకు 1000 నుండి 2000 తీసుకోని ఎలాంటి ప్రూఫ్స్ లేకుండా రూం ఇస్తున్నారు.వారి అవసరాలు తీరినక రూం వెకైట్ చేస్తున్నారు.రూం తీసుకోని ఉన్నవారికి కావాలి అంటే వారికి అమ్మాయిలని పంపిస్తూ గుట్టు చప్పుడు కాకుండా వ్యాభిచారణి నిర్వహిస్తున్నారు.చుట్టు పక్కన వారు చెప్పిన కూడా ఆ లాడ్జ్ యాజమాన్యం వారిలో ఎలాంటి మార్పు లేదు.ఇలా చెయ్యడం వల్ల చుట్టు ప్రక్కన ఉండేవారికి చాలా ఇబ్బందిగా అలాగే చుట్టు పక్కకే ఉన్నా కాలేజీ కి వెళ్ళే వారికి ఇబ్బంధులు తాలెత్తుతున్నాయి.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

### 16,వ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మా రాజారెడ్డి



**కోరుట్ల డిసెంబర్ 11 ప్రజాజ్యోతి :** అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని జగిత్యాల జిల్లా కోరుట్ల మున్సిపల్ 16,వ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మా రాజారెడ్డి అన్నారు. బుధవారం వార్డులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగారావు ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు సూచనలతో ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పేదలకు సంక్షేమ అందించాలని ఉద్దేశంతో ప్రజా పాలన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తుదారుల ఇండ్లలోకి వెళ్లి సర్వే చేసి ప్రస్తుతం స్థలం ఉండి ఇల్లు లేని వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. తర్వాత స్థలం లేని వారికి స్థలం కేటాయించి ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతామని అన్నారు. నియోజకవర్గంలో ప్రతి నిరుపేదకు ఇల్లు ఇప్పించేందుకు నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగారావు కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రత్యేక అధికారి జగదీశ్వర్, బలిజ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.